కథ

# గోల్డ్‌రష్

## పాలంకి సత్య

భర్త శంకర్ ఇంటికి వచ్చి కాఫీ తాగి సేదతీరాక ఉమ "మామయ్య కూతురు శశి పెళ్ళిట. ఈ వేళ మామయ్యా, అత్తా ఫోను చేసి చెప్పారు. వచ్చేనెల 22న పెళ్ళి. త్వరలో శుభలేఖ పంపిస్తామనీ, మీతో కూడా ఫోన్లో మాట్లాడతామనీ, వీలు కాకపోతే ఇ-మెయిల్ రాస్తామనీ చెప్పారు. మనిద్దరినీ తప్పకుండా రమ్మన్నారు. అమ్మ నాలుగు రోజులు ముందే ఏర్పాట్ల కోసం వెడుతుందిట. మనం పెళ్ళికి వెడదాం" అంది.

శంకర్ "వచ్చేనెలలో కొత్త ప్రొడక్ట్ ఒకటి మర్కెట్‌లోకి రిలీజ్ చేస్తున్నారు. నాకు శలవు దొరకదేమో" అన్నాడు.

"పోనీ నేను వెళ్ళిరానా? రెండు రోజుల్లోనే వచ్చేస్తాను."

శంకర్ మాట్లాడలేదు. ఉమ మళ్ళీ రెట్టించి అడిగింది.

శంకర్ నెమ్మదిగా "మన పెళ్ళి ఎన్ని అవరోధాల మధ్య జరిగిందో మర్చిపోయావా? ఇప్పుడందరూ నీతో మాట్లాడుతున్న మాట వాస్తవమే కానీ నీ నిర్ణయాన్ని ఎవరూ హర్షించలేదు. ఎవరైనా ఏదైనా అంటే నువ్వు బాధపడకుండా ఉండలేవు కదా" అన్నాడు.

ఉమ నిట్టూర్చింది. ప్రస్తుత కాలంలో అమెరికా మీద ఉన్న క్రేజ్ ఇంక దేనిమీదా లేదు. అబ్బాయిలకీ, చాలాచోట్ల అమ్మాయిలకీ అమెరికాలో ఉద్యోగం కావాలి. అమ్మాయిలందరికీ అమెరికా వరుడు కావాలి. తల్లితండ్రులందరికీ తమ పిల్లలు అమెరికాలో ఉండాలి. అటువంటి ఆలోచనలతోనే ఉమ తల్లి భవానీ కూతురికి అమెరికా సంబంధాలే వెతకసాగింది. ఉమ తన చిన్ననాటి క్లాస్‌మేట్ అయిన శంకర్‌నే పెళ్ళి చేసుకుంటానంది. భవానీ తాటి చెట్టు ఎత్తున లేచింది.

"బంగారం లాంటి సంబంధాలు తెస్తూంటే దిక్కుమాలిన అణా కాణీ వాణ్ణి చేసుకుంటానంటావేమిటి? ఇలాంటి ప్రేమా దోమా పెళ్ళిళ్ళు మన ఇంటా వంటా లేవు."

ఉమ నెమ్మదిగానే జవాబు చెప్పింది. "శంకర్ అణా కాణీ వాడు కాదు. అతను ఎమ్.టెక్ చేశాడు. మల్టీనేషనల్ కంపెనీలో మేనేజర్‌గా ఉన్నాడు. నేనేమీ దిక్కుమాలిన సంబంధం చేసుకుంటాననడం లేదు."

"ఇక్కడ మేనేజరంటే ఏమిటి గొప్ప? డాలర్ల సంపాదన ముందు ఈ దేశం జీతాలు ఏ మూలకి? నా బంధువుల కూతుళ్ళూ, ఫ్రెండ్స్, పిల్లలూ అంతా అమెరికా సంబంధాలే చేసుకున్నారు. అందరూ అమెరికా చూసి వచ్చినవాళ్ళే, చెప్పింది వింటేనే కడుపు నిండిపోతుంది. అక్కడ కార్లూ, రోడ్లూ, మాల్సూ, మ్యూజియంలూ..."

"ఇప్పుడిక్కడా పెద్ద పెద్ద మాల్స్ వచ్చాయి"

"ఎంతయినా అక్కడంత పెద్దవి ఉంటాయేమిటి? ఉంటే మాత్రం అక్కడంత హాయిగా కొనుక్కునేందుకు డబ్బుండాలి కదా. డాలరంటే నలభై రూపాయలు"

ఉమ మాట్లాడలేదు. తన నిర్ణయం మార్చుకోలేదు. శంకర్‌ని రిజిస్టర్ మారేజ్ చేసుకుంది. కూతురి నిర్ణయాన్ని హర్షించకపోయినా, లోకం కోసం భవాని అందరినీ పిలిచి హిందూ పద్ధతిలో ఇంకోసారి పెళ్ళి జరిపించింది. "మీ నాన్నే ఉంటే ఇలా జరగనిచ్చేవారా?" అని ముక్కు ఎగబీలుస్తూ అంటూనే వివాహ కార్యక్రమం పూర్తి చేయించింది. తండ్రికి మాతృదేశమంటే ఎంత ఇష్టమో తెలిసినప్పటికీ ఉమ తల్లికి జవాబు చెప్పలేదు.

శంకర్ పిలుపుతో గతం తాలూకు జ్ఞాపకాల నుంచి వర్తమానంలోకి వచ్చింది ఉమ.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"ఏం లేదు. మన పెళ్ళి అయి ఆర్నెల్లు అవుతోంది. మీ ఉద్యోగం, జీతం, మన ఇల్లు, కారు, ఫర్నిచర్ అన్నీ చూశాక అమ్మకూడా సంతోషంగానే ఉంది"

శంకర్ మాట్లాడలేదు.

ఉమ "ప్లీజ్ వెళ్ళి వస్తాను. నన్నుకానీ మిమ్మల్ని కానీ ఎవరూ ఏమీ అనరు. ఎవరైనా ఏమైనా అంటే నేను జవాబు చెప్తానే కానీ బాధపడను" అంది.

శంకర్ ఒక్కక్షణం ఆగి "అలాగే, నువ్వు ఆనందంగా ఉండడం నాకు ముఖ్యం. దేనికీ బాధపడకూడదు" అన్నాడు.

అనవసరంగా వర్రీ అవుతున్నారన్నట్లుగా చూసింది ఉమ.

ooo

ఉమ మేనమామ ఇంటి ముందు ఆటో దిగింది. ఇంటివైపు చూసింది. ఇంట్లో ఎవరూ ఉన్నట్లులేదు. పెళ్ళిసందడి లేదేమిటనుకుంటూ లోపలకు వెళ్ళింది.

ఉమ అమ్మమ్మ సోఫాలో కూర్చుని ఉంది.

"అమ్మామ్మా ఇంట్లో ఎవరూ లేరేమిటి? అప్పుడే అందరూ కళ్యాణ మంటపానికి వెళ్ళిపోయారా? రేపు ఉదయం కదా ముహూర్తం"

"మీ పిన్ని కూతురు, అదేనే, నా మనవరాలు రమ అమెరికా నుంచి వస్తోంది. అందరూ స్వాగతం చెప్పడానికి విమానాశ్రయానికి వెళ్ళారు. మీ అమ్మ కూడా వెళ్ళింది. నువ్వు వస్తున్నావుకదా ఇంట్లో ఉండమన్నాను. కానీ అందరూ వెళ్ళారు. మగ పెళ్ళివారి కన్నా ముందు రమకే ఎదుర్కోలు సన్నాహం జరిపించేస్తున్నారు."

ఉమ చిన్నగా నవ్వి "కాఫీ తాగావా?" అంది.

"లేదింకా. ప్రొద్దుట నాలుగింటికి విమానం వస్తుందిట. మూడింటికే వెళ్ళిపోయారు"

"నేను ఇస్తాను" అంటూ ఉమ లోపలకు వెళ్ళి కాఫీ పెట్టి, రెండు గ్లాసులతో తెచ్చింది. ఇద్దరూ కాఫీ తాగుతుండగా ఇంటిముందు రెండు కార్లు ఆగాయి. రెండు పెద్ద పెట్టెలతో, పెద్ద కారీ బ్యాగుతో, చేతిలో వానిటీ బ్యాగుతో లోపలకు వచ్చింది రమ. ఆమెతో పాటు లోపలకు వచ్చిన బంధువులంతా ఆమె చుట్టూ గుమికూడారు.

"అబ్బ, జెట్‌లాగ్‌తో నిద్ర వస్తోంది బాబూ" అంటూ ఆవలించింది. వెంటనే ఉమ తల్లి భవాని లోపలకు వెళ్ళి కాఫీ తెచ్చింది.

రమ కాఫీ ఒక గుక్క తాగి "బాగా చేదుగా ఉంది. పాలు ఎక్కువగా ఉంటేకానీ తాగలేను. చికోరీ వాసన అసలు పడడంలేదు. ఎప్పుడైనా న్యూ ఆర్లియన్స్ వెడితే చికోరీ కాఫీ స్పెషల్ కాబట్టి తీసుకుంటాను" అంది.

"ఇరవై ఏళ్ళు ఇక్కడ ఈ కాఫీయే తాగావుగా?" అన్న ఉమ అమ్మమ్మ మాటలు మిగిలినవారి హడావుడిలో వినిపించలేదు.


రమ తెచ్చిన వస్తువుల ప్రదర్శనా, బహుమతుల పంపకం అయ్యాయి. భవాని కూతురికేసి 'ఎలాంటి స్వర్గాన్ని వదులుకున్నావో చూడు' అన్నట్లు చూసింది. ఉమ మాట్లాడలేదు.

ooo

"సాయంత్రం ఆరుగంటలకి ఎదురు సన్నాహం,

పానకం బిందెలివ్వడం, శుభలేఖలు మార్చుకోడం. కాబట్టి అంతా తొందరగా తెమలండి అన్న మామయ్య మాటలతో ఉమ లేచి తయారయింది. ఎర్రటి బెనారస్ చీర కట్టుకుని, చెవులకి పగడాల దుద్దులు పెట్టుకుంది. మెడలో ముత్యాలదండ వేసుకుని, నెక్లెస్ పెట్టుకుంది.

"మొన్న నా పుట్టినరోజుకి ఈ నెక్లెస్ కొని పెట్టారు"



అని తల్లికీ, పిన్నికీ, మేనమామ భార్యకీ ఒకేసారి చూపించింది.

ఉమకి పెద్దగా నగలు ఇష్టంలేదు. అయినా భర్త ఏమీకొనలేదని అందరూ అంటారన్న భయంతో నెక్లెస్ చూపించింది.

"ఏమిటి మరీ వెండిది కొన్నాడేమిటి?" అంది పిన్ని.

"ఏం చెయ్యగలం, అంతా ప్రారబ్ధం. ఇంకా చెప్పాలంటే స్వయంకృతం. అమెరికా సంబంధాలెన్ని చూశానో. వింటేనా? నీ కూతుర్ని చూడు మహారాణిలా ఉంది" అంది భవాని.

"అమ్మా ఇది వెండి కాదు. వైట్ గోల్డ్. మామూలు బంగారం కన్నా ఖరీదెక్కువ"

"అంతేలే, మొగుడి మీద ఈగ వాలనివ్వవు" అని ఇంకా అనబోయేలోగా రమ వచ్చింది. నాలుగు పేటల గొలుసు, మెడ చుట్టూ మెరుస్తున్న చోకర్. ఒక చేతికి బ్రేస్‌లెట్, రెండో చేతికి డజను గాజులు, చెవులకి అర అడుగు పొడుగున్న జూకాలు. అంకాళమ్మలా ఉందని ఉమ అనుకునేలోగా భవాని "మహాలక్ష్మిలా ఉన్నావు. యాభై కాసులకి తక్కువ ఉండదు ఒంటిమీద బంగారం" అంది.

"ఏదైనా ఇక్కడకు వచ్చినప్పుడే పెట్టుకోవాలి. అక్కడ ఎవరూ బంగారం వేసుకోరు. అంతా డైమండ్సే. నాలుగు రకాల డైమండ్ బ్రూచెస్, బ్రేస్‌లెట్స్, చోకర్స్ ఉన్నాయి" అంది రమ. భవాని ఉమకేసి చూసింది. ఉమ తలతిప్పుకుంది.

○○○○

ఎదురు సన్నాహం కార్యక్రమం అయి ఇంటికి వచ్చాక ఎవరెక్కడ పడుకోవాలి అన్న డిస్కషన్ మొదలైంది.

"ఎలాగూ తెల్లవారకట్ల ముహూర్తం. రాత్రి రెండింటికైనా లేవాలి. అందరం హాల్లో చాపలు వేసుకుందాం' అంది ఉమ అమ్మమ్మ.

"అమ్మో. ఉక్కపోసేస్తోంది. నేను ఎ.సి. లేకుండా పడుకోలేను బాబూ" అంది రమ.

తర్జన భర్జనలయ్యాక ఉన్న ఒక్క ఎ.సి. రూంలో రమకి సింగిల్‌కాట్ వేశారు. రెండో కాట్ ఆరుబయట వేసుకుని ఉమ మామయ్య పడుకున్నాడు. రమ మంచానికి పక్కన మామూలు పరుపువేసి ఉమను పడుకోమన్నారు. గొడవ పెట్టుకోడం ఇష్టంలేని ఉమ పరుపుమీద పడుకుని ఆలోచించసాగింది. శంకర్ చెప్పింది రైటు. పెళ్ళికి రాకుండా ఉండాల్సింది. మామూలుగానే అంతంతమాత్రం గౌరవం దక్కేది.

ఇంక రమ అమెరికా నుంచి వచ్చింది. కన్నతల్లికే తనగురించి పట్టనప్పుడు మిగిలినవాళ్ళ సంగతి గురించి ఆలోచన దేనికి?

రమ ఎ.సి. ఫుల్‌గా పెట్టుకుని పడుకుంది. కింద పల్చటి పరుపుమీద పడుకున్న ఉమకి చలితో నిద్రపట్టడంలేదు. అటూ ఇటూ దొర్లుతున్న ఆమెకు ఖంగుమని చప్పుడైంది. కొక్కెం ఊడిపోయింది కాబోలు రమ గొలుసు కింద పడింది. రమ గాఢంగా నిద్రపోతోంది. పొద్దున్నే ఇవ్వచ్చులే అనుకుని తన బ్యాగ్‌లో పెట్టుకుంది.

○○○

అతి కష్టం మీద నిద్రపట్టే సమయానికి "ముహూర్తం టైంకి అందుకోవాలి. అందరూ లెండి" అన్న మామయ్య పిలుపుతో ఉమ లేచింది.

ఇంట్లో అందరి స్నానాలూ, మంగళస్నానాలూ, హడావుడిగా కళ్యాణ మంటపానికి ప్రయణాలూ, ఉమ గొలుసివ్వడం మర్చిపోయింది.

పెళ్ళిమంటపంలో రమదే హడావుడంతా. పురోహితుడి మాటకన్నా ఆమె మాటకే ఇరువైపులవాళ్ళూ విలువ ఇస్తున్నారు. వేరే నగలు అలంకరించుకున్న రమకి గొలుసు సంగతి గుర్తు కూడా లేదా అనుకుంది ఉమ.

పెళ్ళి పూర్తయి అందరూ భోజనాలకి కూచున్నారు. రమ తను వేసుకున్న పగడాలు ప్రత్యేకంగా ఇటలీలో కొనుక్కున్నానని పక్కనున్న ఆవిడతో చెప్తోంది. ఎక్కువ నగలుండడం వల్లనే రమకి తన గొలుసు కింద పడిందన్న సంగతి కూడా జ్ఞాపకం లేదా? పెళ్ళిలో హడావుడి చెయ్యడంలో మర్చిపోయిందా? ఉమకి ఒక చిలిపి ఊహ వచ్చింది. రమ నగ పోయిందని ఎప్పుడు గమనిస్తుందో చూద్దాం. అప్పుడు "ఎంత డబ్బున్నదానివైతే మాత్రం ఇంతదాకా గొలుసు సంగతి గుర్తులేదా?" అని ఇచ్చెయ్యచ్చు.

గంటలు గడిచిపోయాయి. సాయంత్రం రిసెప్షన్ కూడా అయిపోయింది. రమ గొలుసు ఊసే ఎత్తలేదు. ఉమకి ఏం చెయ్యాలో తెలియలేదు. ఇప్పుడిచ్చేద్దామింక అని అనుకుంటూండగా ఉమ చిన్ననాటి స్నేహితురాలు రిసెప్షన్‌కి వచ్చింది. పద మా ఇల్లిక్కడే ఒక అరగంటలో వచ్చేద్దువుగానీ" అంటూ తన ఇంటికి తీసికెళ్ళింది.

స్నేహితురాలితో కబుర్లు గంటకి కానీ పూర్తి కాలేదు. కల్యాణ మంటపానికి తిరిగి వచ్చిన ఉమకి రమ కన్పించలేదు. "రమ ఏదమ్మా?" అంటే భవాని "వాళ్ళాయన బంధువులున్నారట. రాత్రి అక్కడ ఉంటానని వెళ్ళింది. నీకు రైలు టైం అయినట్లుంది. బయల్దేరు" అంది.

ఉమకి ఏం చెయ్యాలో తెలియలేదు. తల్లికి గొలుసిచ్చే ధైర్యంలేదు. మిగిలిన వాళ్ళంతా మగపెళ్ళివారితో ఉన్నారు. రైలుకి టైం అయిపోతుదంటూ తల్లి హడావుడి పెడుతోంది. తనతో పుట్టింటికి రమ్మని మాట వరసకైనా అనలేదనుకుంటూ ఉమ ఆటో ఎక్కింది.

ఎలా ఆటోలో స్టేషనుకి వెళ్ళిందో, ఎలా ప్లాట్ ఫామ్ మీద రైలు కోసం ఎదురుచూసిందో, ఎలా రైలెక్కిందో ఉమకి తెలియదు. తప్పు చేశానన్న భావంతో, శిక్ష పడుతుందన్న భయంతో ఆమెకు స్పృహ లేదు. బెర్తు మీద పడుకున్న ఆమెకు నిద్రలేదు. కునుకు పట్టినా రమ పోలీసులతో వచ్చినట్లూ, 'ఈమె నా గొలుసు దొంగిలించింది' అని చెప్పినట్లూ, పోలీసులు బేడీలు వేసినట్లూ కలలు.

మర్నాడు పొద్దున్న ఇంటికి చేరిన ఉమకి గుమ్మంలోనే శంకర్ ఎదురై "సారీ ఉమా, రాత్రి ఆఫీసునుంచి వచ్చేసరికి మూడయింది. ఉదయం లేవలేకపోయాను" అన్నాడు.

ఉమ అతన్ని వాటేసుకుని బావురుమంది. కంగారుపడ్డ శంకర్ నెమ్మదిగా లోపలకు తీసికెళ్ళి, సోఫాలో కూచోపెట్టి "ఏమైంది ఉమా ఎవరైనా ఏమైనా అన్నారా?" అన్నాడు.

ఉమ "నేను తప్పుచేశాను" అంది.

"తప్పు నాదే. నిన్ను వెళ్ళనివ్వకుండా ఉండాల్సింది"

"లేదు. అదికాదు" అంటూ ఉమ మళ్ళీ బావురుమంది.

శంకర్ "కొంచెం బాధ తగ్గాక మాట్లాడుతుందిలే" అని ఊరుకున్నాడు.

కొంచెం సేపు ఏడ్చాక ఉమ ఉపశమనం పొంది, విషయం చెప్పింది. "నేను సరదాగా తీశానంతే. దొంగతనం చెయ్యాలనుకోలేదు. అయినా శిక్ష తప్పదు. మీకూ నావల్ల చెడ్డపేరు.

శంకర్ ఆమె చుట్టూ చెయ్యివేసి "ఇందులో నేరమూ, శిక్షా లేవు. ఈవేళే గొలుసు ఇన్సూర్డ్ పోస్ట్‌లో పంపేద్దాం. ఏదీ గొలుసు" అన్నాడు.

ఉమ బ్యాగ్‌లోంచి తీసి ఇచ్చింది. శంకర్ ఒక్కక్షణం గొలుసుని పరీక్ష చేసి ఉమ వైపు చూసి నవ్వాడు.

నవ్వెందుకన్నట్లు కొంత ఆశ్చర్యంగా, కొంత కోపంగా చూసింది ఉమ.

"నేను చదివింది మెటలర్జీ అని నీకు తెలుసు. మా నాన్నగారు బంగారం వ్యాపారం చేసేవారనీ తెలుసు. ఇది బంగారం కాదు. ఇండియాలో కన్నా అమెరికాలో బంగారం కోటింగ్ బాగా వేస్తారంతే"

"అంటే..."

"అంతే..."

ఉమలో ఆశ్చర్యమూ, ఆనందమూ, ఉక్రోషము ఒకేసారి చోటు చేసుకున్నాయి. తను వైట్ గోల్డ్‌తో నగ చేయించుకుంటే దాన్ని చూసి వెండా అని అడిగారు. రమ గోల్డ్ కోటింగ్ నగ వేసుకుంటే ఎవరికీ అనుమానమైనా రాలేదు. అమెరికా అంటే అంత గొప్పా? ఆ దేశంలో బంగారం వర్షం కురుస్తుందా? ఎప్పుడో నూట యాభై ఏళ్ళనాడు అమెరికాలోని కాలిఫోర్నియాలో బంగారం కోసం ప్రాణాలు లెక్క చెయ్యకుండా వెళ్ళారుట. దాన్నే గోల్డ్ రష్ అంటారు. ఇప్పుడు జరుగుతున్నదేమిటి? గోల్డ్ ఉందో లేదో కానీ రష్ ఉంది. ఎక్కడకి? భూతల స్వర్గానికా, భూతాల స్వర్గానికా?

ఉమలో ఆలోచనలు సాగి సాగి సంతృప్తి అనే శిఖరాన్ని చేరుకున్నాయి.

## బుల్లితెరపై సిమ్రాన్!

*సినిమా రంగంలో సెకండ్ ఇన్నింగ్స్ సిమ్రాన్‌కి కలిసి రాలేదు. రీ ఎంట్రీలో ఆమె నటించిన మలయాళ చిత్రం, తెలుగు చిత్రం (ఒక్క మగాడు) ఫ్లాప్ కావడంతో ఇక ఎందుకొచ్చిన తంటా అనుకుందేమో గుమ్మం ముందుకొచ్చిన టీవీ ఆఫర్‌ని ఒప్పేసుకుంది. ఓ తమిళ టీవీ సీరియల్ కథానాయికగా నటిస్తోంది సిమ్రాన్. ఆ సీరియల్‌కి గనక మంచి పేరొస్తే ఇక బుల్లితారగా బిజీ అవుతుందేమో!*

